తెలంగాణ పసుపు బోర్డుకు నిధులేవి?

- కేంద్రం పైసా ఇవ్వకపోవడం దారుణం
- చైర్మన్‌కు కార్యాలయం కూడా లేదు
- దక్షిణాది రాష్ట్రాల నిధులు దారి మళ్లింపు

గల్ఫ్ కార్మికుల సాధారణ మరణాలకు బీమా యోజనను వర్తింపజేయాలి

బడ్జెట్‌పై చర్చలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు పైసా కేటాయించకపోవడం దారుణమని రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగాన్ని దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అం టూ ప్రారంభించడం అభినందనీయమని, ఆచరణలో సైతం ఈ మహోన్నత నినాదాన్ని అమ లు చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

'బీహార్‌లో 'మకానా బోర్డు' ఏర్పాటు చేస్తున్నట్టు బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నం.. కానీ ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించిన పసుపు బోర్డుకు బడ్జెట్‌లో పైసా కేటాయించకపోవడం ఏమిటి? తెలంగాణలో పసుపుబోర్డు పరిస్థితి బాహర్ షేర్వానీ.. అందర్ పరేషానీ అన్నట్టుగా ఉన్నది.' అని ఎద్దేవాచేశారు. పసుపుబోర్డు చైర్మన్‌ను నియమించారని, ఆయన కూర్చునేందుకు కార్యాలయం కూడా లేదని, ఏవైనా పనులు చేయాలన్నా చైర్మన్ వద్ద నిధులు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రం పసుపుబోర్డుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

> దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులను ఫైనాన్స్ కమిషన్ దారి మళ్లించడం సరికాదు. కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలు అధిక మొత్తంలో పన్నుల రూపంలో చెల్లిస్తున్నయ్. అయినా దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తక్కువ నిధులు విడుదల చేయడం దారుణం.
>
> - కేఆర్ సురేశ్‌రెడ్డి

ప్రాజెక్టుల్లో పూడికతీయాలి

దేశంలో 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని సురేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ అని చెప్తున్న కేంద్రం వారందరికీ మద్దతుగా నిలవాలని కోరారు. దేశంలో 3,700 చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. కానీ, చాలా ఏండ్ల నుంచి నిర్వహణ లోపం కారణంగా నీటి నిల్వ సామర్థ్యం 25 శాతానికి తగ్గిందని ఆవేదన వ్యక్తంచేశారు. డ్యామ్‌లలో పూడిక తొలిగించే విషయంలో కేంద్రం చొరవ చూపాలని కోరారు. పూడిక మట్టి రైతులకు జీవ ఎరువుగా ఉపయోగపడుతుందని సూచించారు. దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల కేటాయింపు సరికాదని, నిధుల పంపిణీ, సెస్‌పై అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశాన్ని అభివృద్ధి చేసేందుకు భారీగా వనరులు ఉన్నాయంటూనే.. 80 కోట్ల మందికి ఉచిత రేషన్ ఇవ్వటం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నదని విమర్శించారు. గల్ఫ్ కార్మికులు ఆయా దేశాల్లో ప్రమాదవశాత్తు చనిపోతే వారికి బీమా సౌకర్యం కల్పించేందుకు 'ప్రవాసీ భారతీయ బీమా యోజన'ను కేంద్రం అమల్లోకి తెచ్చిందని, సాధారణ మరణాలకు సైతం ఈ స్కీంను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

- ఢిల్లీలో ధూంధాంకు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ధూంధాం నిర్వహించనున్నట్టు కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరుశురామ్ తెలిపారు. మంగళవారం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు సంస్థ ప్రతినిధులు ఢిల్లీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ.. అంబేద్కర్, భారత రాజ్యాంగంపై బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఎంతో గౌరవం ఉందన్నారు. మార్చి 26న జరిగే ధూంధాంలో తప్పక పాల్గొంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల రామకృష్ణ దత్తు, రాకేశ్, చతుర్‌బుజ్ పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజును ఆహ్వానిస్తున్న ప్రతినిధులు

రాష్ట్రంలో 192కు చేరిన ఎమ్మెల్సీ నామినేషన్లు!

- 34 నామినేషన్ల తిరస్కరణ
- ముగిసిన గడువు.. ఈ నెల 13 వరకు ఉపసంహరణకు చాన్స్

హైదరాబాద్, నీలగిరి/కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో మొత్తం 192 నామినేషన్లు దాఖలైనట్టు సమాచారం. త్వరలో పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలంగాణ సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించారు. నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి ఈ నెల 13 వరకు గడువు ఉంది. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు స్పష్టంగా తెలియనుంది. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 34 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, సత్యనారాయణగౌడ్, నీ కల్యాణ్‌రావు, కావ్యశ్రీ

దేశంలో జనగణన ఎందుకు చేపట్టరు?

- జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోకి 10 కోట్ల మందిని చేర్చాల్సి వస్తుందనా?
- రిజర్వేషన్ల పెంపు అమలు తప్పదనా?
- డీలిమిటేషన్ చేయాల్సి ఉంటుందనా?
- 2021లో కరోనా కారణంగా వాయిదా
- 15 ఏండ్లయినా పట్టించుకోని మోదీ
- ఇప్పటికైనా కేంద్రం స్పష్టత ఇవ్వాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా జనాభా గణన ఎందుకు చేపట్టడం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతి పదేండ్లకు ఒకసారి చేయాల్సి ఉండగా, 15 ఏండ్లయినా ఎందుకు చొరవ తీసుకోవడం లేదని నిలదీశారు. 2021లో దేశవ్యాప్తంగా జనగణన జరగాల్సి ఉన్నా కరోనా కారణంగా వాయిదా పడిందని చెప్పారు. ఈ సంవత్సరంలో జనాభా లెక్కలు కచ్చితంగా జరుగుతాయని అందరూ భావించినా జరగలేదని తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణగౌడ్, లీగల్ సెల్ సభ్యులు నీ కల్యాణ్‌రావు, కావ్యశ్రీతో కలిసి వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. జనగణన జరిపితే ఆహార భద్రతా చట్టం పరిధిలోకి సుమారు 10 కోట్ల మందిని చేర్చాల్సి వస్తుందని ప్రధాని మోదీ పట్టించుకోవడం లేదా? అని ప్రశ్నించారు. జనగణనతో పాటు కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్ వస్తున్నందున రిజర్వేషన్లను పెంచాల్సి ఉంటుందని, డీలిమిటేషన్ చేయాల్సి ఉంటుందని ప్రధాని మోదీ జనాభా లెక్కలు తీయడం లేదా? అని నిలదీశారు. 2019 బడ్జెట్‌లో జనగణన కోసం రూ.8 వేల కోట్లు కేటాయించి ఇపుడు కేంద్రం రూ.574 కోట్లు మాత్రమే కేటాయించడంతో అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. పేదరిక నిర్మూలనకు, సంక్షేమ పథకాల సమర్థ అమలుకు జనాభా లెక్కలు తప్పనిసరని చెప్పారు. ప్రధాని మోదీ దగ్గర ఏ లెక్కలూ లేక గుడ్డెద్దు చేలో పడ్డట్టు ముందుకు సాగుతున్నారని వినోద్‌కుమార్ విమర్శించారు.

బాధ్యతల నుంచి తప్పుకుంటున్న మోదీ

దేశ ప్రధాని మోదీ తన బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని వినోద్‌కుమార్ మండిపడ్డారు. కులగణన నుంచి తప్పించుకునేందుకే మోదీ జనగణన చేయడం లేదనే అనుమానం కలుగుతున్నదని విమర్శించారు. ప్రతి పదేండ్లకు 15 శాతం జనాభా వృద్ధి ఉంటుందని గణాంకాలు చెప్తున్నాయని, ఈ లెక్కన దేశంలో కొత్తగా 20 కోట్ల మంది పెరుగుతారని, ఇందులో సుమారు 10 కోట్ల మంది పేదలు ఉంటారని, వీరంతా జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. జనగణన జరిపితే వీరందరికీ నిత్యవసరాలు, రేషన్ సరుకులు ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పించాల్సి వస్తుందని మోదీ జనాభా లెక్కలు తీయడం లేదని విమర్శించారు. కులగణన చేస్తే కులాలవారీగా రిజర్వేషన్లు, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల డీలిమిటేషన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కొత్త జనాభా లెక్కల ప్రకారం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల చట్టం అమలు కావాలని, వాటిని మరో 20 ఏండ్లు వాయిదా వేసే కుట్ర జరుగుతున్నదని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో సోమవారం సోనియా గాంధీ ఆహార భద్రతా చట్టం గురించే మాట్లాడారు తప్ప జనాభా లెక్కలకు మహిళా రిజర్వేషన్లకు ఉన్న సంబంధం గురించి మాట్లాడలేదని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే జనాభా లెక్కలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన ప్రకటన చేసి సరిపడా నిధులు కేటాయించాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు.

ఆరు గ్యారెంటీలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, అందులో భాగమైన 420 హామీలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణతో పాటు ఆరు గ్యారెంటీల గారడీపై ప్రజలకు స్పష్టత వచ్చిందన్నారు. అలాగే వరంగల్ రైతు డిక్లరేషన్, రైతు రుణ మాఫీ, రైతుభరోసాపై రైతులతోపాటు యువకులు, మహిళలు, విద్యార్థులు, కూలీలు, ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆటో డ్రైవర్లు ఇలా అనేక రంగాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని ఆయన కోరారు.

'సీతారామ' డీపీఆర్‌పై కేంద్రం మరో కొర్రీ!

- బరాజ్ అనుమతులు పెండింగ్
- మేడిగడ్డ సాకుగా చూపి నిరాకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): సమీకృత సీతారామ ఎత్తిపోతల పథకం- సీతమ్మ సాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు సంబంధించిన తుది అనుమతులపై కేంద్ర ప్రభుత్వం మరో కొర్రీ పెట్టింది. ఢిల్లీలో మంగళవారం జరిగిన టెక్నికల్ అప్రైజల్ కమిటీ (టీఏసీ) సమావేశంలో సీతారామ ప్రాజెక్టు డీపీఆర్‌పై చర్చించింది. మేడిగడ్డ బరాజ్‌లో ఒక పిల్లర్ దెబ్బతిన్న ఘటనను సాకుగా చూపుతూ అనుమతులను పెండింగ్‌లో పెట్టింది. మేడిగడ్డ ప్రమాదం నేపథ్యంలో సీతారామ డిజైన్లను మరోసారి సీడబ్ల్యూసీతో పరిశీలించాలని సూచించింది. వాస్తవానికి సీడబ్ల్యూసీ పరిధిలోని అన్ని విభాగాల నుంచి ఇప్పటికే డీపీఆర్‌కు ఆమోదం లభించింది. ఏ ప్రాజెక్టుకైనా సీడబ్ల్యూసీ అనుమతి వస్తే టీఏసీ అనుమతులు లభించడం లాంఛనమే. కానీ, కేంద్రం ఉద్దేశపూర్వకంగానే మేడిగడ్డను సాకుగా చూపి కొర్రీలు పెట్టిందని విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడం వల్లే టీఏసీ అనుమతులు రాలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, గోదావరి బేసిన్ అధికారులు ఢిల్లీకి తరలివెళ్లారు. వారు గట్టిగా వాదనలు వినిపించకపోవడంతో అనుమతులు రాలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాదిగా ఇదే పరిస్థితి

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే 14 నెలల్లో ఒక్క డీపీఆర్‌కు కూడా ఆమోదం లభించలేదని సాగునీటి రంగ నిపుణులు విమర్శిస్తున్నారు. దీంతో ఒకప్పుడు బీఆర్ఎస్ హయాంలో వేగంగా కొనసాగిన ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బ్రేక్ పడిందని చెప్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు గతంలో ఏడాదిన్నర కాలంలోనే ఐదు ప్రాజెక్టులకు అనుమతులు సాధించిందని పేర్కొంటున్నారు. కానీ, ఇప్పుడు 14 నెలలుగా ఏకంగా నాలుగు డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయని విమర్శిస్తున్నారు.

15న ఘనంగా సేవాలాల్ జయంతి

- తెలంగాణ భవన్‌లో వైభవోపేతంగా నిర్వహణ
- కేటీఆర్, గిరిజన ప్రముఖులు హాజరు
- ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సత్యవతి

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్. చిత్రంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, నాయకులు రామచంద్రు నాయక్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తెలిపారు. ఈ వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేతారక రామారావు, గిరిజన ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 16 కోట్ల మంది గిరిజనులకు సేవాలాల్ మార్గదర్శి, ఆదర్శప్రాయుడని కొనియాడారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, నాయకులు రామచంద్రు నాయక్, వాద్యా నాయక్, సంజీవ్ నాయక్, శ్రీనివాస్, రవితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. సేవాలాల్ పుట్టి పెరిగిన మహారాష్ట్రలో కూడా ఆయన జయంతిని సర్కారు అధికారికంగా నిర్వహించడం లేదని చెప్పారు. కేసీఆర్ హయాంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడం మొదలైందని గుర్తుచేశారు. గిరిజనులకు హైదరాబాద్ నడిబొడ్డున రూ.25 కోట్లతో సేవాలాల్ మహారాజ్ భవన్‌ను కేసీఆర్ కట్టించారని తెలిపారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. నేడు కాంగ్రెస్ పాలనలో గిరిజనులు అనాథలుగా మారారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో గిరిజనులకు కాంగ్రెస్ మాయమాటలు చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. పెద్దసంఖ్యలో గిరిజన గురుకులాలను కేసీఆర్ ఏర్పాటు చేస్తే.. నేడు కాంగ్రెస్ సర్కారు వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇవ్వడం లేదని, 14 నెలలుగా 14 పైసలు కూడా విడుదల చేయలేదని, విదేశాల నుంచి గిరిజన విద్యార్థులు చదువు మధ్యలోనే వదిలేసి తిరిగి వస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన సంక్షేమశాఖ సీఎం దగ్గరే ఉన్నదని, ఆ మంత్రిత్వశాఖ నిర్వహించడానికి కాంగ్రెస్‌లో గిరిజనులెవ్వరూ లేరా? అని ప్రశ్నించారు. గిరిజనులకు కేటాయించిన బడ్జెట్ కూడా ఖర్చు కావడం లేదని మండిపడ్డారు. గిరిజన బిడ్డలు కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు మధ్య తేడా గమనించాలని సూచించారు. కేసీఆర్ పాలన వస్తేనే గిరిజనులకు మేలు జరుగుతుందని చెప్పారు.

10 శాతం రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దే: కవిత

గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని మాజీ ఎంపీ మాలోత్ కవిత పేర్కొన్నారు. గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో 55 నుంచి 60 నియోజకవర్గాల్లో లంబాడాల సంఖ్య గణనీయంగా ఉన్నదని చెప్పారు. గిరిజన గురుకులాల్లో రేవంత్ ప్రభుత్వం విద్యార్థులకు ఆహారం కూడా సక్రమంగా పెట్టడం లేదని మండిపడ్డారు. గిరిజనుల భూములను ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటున్నదని విమర్శించారు. గిరిజన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రేవంత్ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా అయినా కల్యాణలక్ష్మి కింద ఇస్తానన్న తులం బంగారం పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగే సేవాలాల్ జయంతి కార్యక్రమానికి గిరిజనులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు.



బీఆర్ఎస్‌లో చేరినవారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

ఆరు నెలల్లో ప్రభుత్వం కూలిపోతది!

- ఉప ఎన్నికలతోపాటు సీఎం మార్పు ఉండొచ్చు
- ఢిల్లీలో ఓటమితో కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి జోస్యం

కొడకండ్ల, ఫిబ్రవరి 11: మరో ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలనున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోస్యం చెప్పారు. మంగళవారం ఆయన జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేక లోలోపల కుమ్ములాటలు జరుగుతున్నట్టు తెలిపారు. ఏ క్షణమైనా ప్రభుత్వం కూలిపోయి సీఎం మార్పు జరగవచ్చని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాలతోపాటు ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమితో ప్రజలకు ఆ పార్టీపై నమ్మకం పోయిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉప ఎన్నికలు తప్పవని స్పష్టంచేశారు. 50 మందికిపైగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా ఎర్రబెల్లి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

దీక్ష విరమించిన గాంధీనాయక్

ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయాలని కోరుతూ ఈ నెల 8న కొడకండ్లలో మొదలుపెట్టిన నిరాహార దీక్షను మంగళవారం ఎర్రబెల్లి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1995 తర్వాత ఇద్దరికి మించి పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వస్తానని.. రానని.. రాహుల్ దోబూచులాట

- వరంగల్‌కు వస్తారంటూ ఉదయం ప్రచారం
- కాజీపేట నుంచి చెన్నైకి రైల్లో వెళ్తారంటూ హడావుడి
- చివరకు పర్యటన రద్దయిందంటూ వర్తమానం

వరంగల్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆకస్మికంగా వరంగల్‌కు వస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం కొన్ని గంటలపాటు హడావుడి చేశారు. ప్రత్యేకంగా ఎలాంటి కార్యక్రమంలో పాల్గొనేది లేదంటూనే రాహుల్‌గాంధీ వరంగల్‌కు వస్తున్నారంటూ మంగళవారం ఉదయం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. రాహుల్‌గాంధీ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 5.45 గంటలకు వరంగల్‌కు వచ్చి, 7.45 గంటలకు కాజీపేట రైల్వేస్టేషన్‌లో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో చైన్నైకి బయలుదేరుతారని అధికారికంగా షెడ్యూల్ వచ్చింది. రాహుల్‌గాంధీ పర్యటనలో భాగంగా వరంగల్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమావేశమవుతారని, బీసీ రిజర్వేషన్ పెంపు, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అంశాలపై ముఖ్యులతో మాట్లాడుతారని ప్రచారం జరిగింది. అయితే, అధికారిక షెడ్యూల్‌లో ఏ ఒక్క కార్యక్రమం లేదని పేర్కొనడంతో సోషల్‌మీడియాలో ప్రచారానికి తెరపడింది. వరంగల్‌లో ఉండే రెండు గంటల్లో అర్ధగంట సేపు హెలిప్యాడ్ నుంచి ఓ ప్రైవేట్ హోటల్‌కు, అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్తారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. రాహుల్‌గాంధీని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కలుస్తారని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హైదరాబాద్ నుంచి రాహుల్‌గాంధీతో వరంగల్‌కు వస్తారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. కాజీపేట నుంచి చెన్నై వరకు రైలులో ప్రయాణించే సమయంలో కేంద్ర ప్రభుత్వం రైల్వేను ప్రైవేటీకరిస్తున్న అంశాలపై రాహుల్‌గాంధీ ప్రయాణికులతో మాట్లాడుతారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే పార్లమెంటులో ముఖ్యమైన బిల్లులపై చర్చ కారణంగా రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన రద్దయినట్టు అధికారులకు సమాచారం వచ్చింది.

పర్యటన రద్దుపై రకరకాల చర్చలు

రాహుల్‌గాంధీ ఆకస్మిక పర్యటన ఖరారు, రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. వరంగల్-నల్లగొండ-ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలోనే రాహుల్ పర్యటన రద్దయి ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని, ఇక్కడ రేవంత్‌రెడ్డిని కలిసేందుకు ఇష్టం లేకనే రాహుల్‌గాంధీ ఆఖరి నిమిషయంలో తెలంగాణ పర్యటనను రద్దు చేసుకున్నారని, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భద్రత కారణాల రీత్యా రద్దు అయిందని ఇలా రకరకాలుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది.

నిలదీస్తారనే ముఖం చాటేసిండు

- ప్రజాగ్రహానికి భయపడే రాహుల్ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నడు
- రాహుల్‌కే కాదు, కాంగ్రెస్ నేతలెవరికీ రాష్ట్రంలో పర్యటించే ధైర్యం లేదు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇచ్చిన ఏ ఒక్కహామీనీ అమలుచేయకుండా రైతు డిక్లరేషన్ ఇచ్చిన చోటుకు వస్తే ప్రజలు తిరగబడతారని భయపడే కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. వరంగల్‌లో హెలికాప్టర్ దిగాల్సిన చోటే గతంలో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని, అందులో ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో రైతులు, ప్రజలు నిలదీస్తాయనే భయంతోనే వరంగల్‌కు ముఖం చాటేశారని మండిపడ్డారు. చెప్పి వస్తే తిరుగుబాటు వస్తుందని రాహుల్ దొంగచాటుగా వద్దామనుకున్నారని, అది కూడా చివరికి రద్దు చేసుకున్నారని దుయ్యబట్టారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, కిషన్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'రైతు రుణ మాఫీ పూర్తి కాలేదు. పంటలకు బోనస్ బోగస్ అయ్యింది. రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్లలో పడలేదు. రేవంత్ వైఫల్యాలపై రహస్యంగా సమావేశం నిర్వహించేందుకు రాహుల్ వస్తున్నారు. ఈ మీటింగ్‌కు రేవంత్‌ను కూడా పిలవలేదని ప్రచారం జరిగింది. రాష్ట్రంలో అవినీతి పాలన జరుగుతున్నదని రాహుల్‌కు కూడా తెలుసు. రాహుల్ పర్యటన రద్దుకు రేవంత్ పాలనా వైఫల్యమే కారణం. ప్రజల్లో తిరుగుబాటు ధోరణిని గ్రహించే రాహుల్ తన పర్యటనను రద్దు చేసుకున్నారు' అని సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

రేవ